# Press Clippings Date: 18.05.2014

## ఎన్నికల విజయవంతంపై 'ఈసీఐఎల్' హర్షం






గుర్రాలపై ఈవీఎంలను రవాణా చేస్తున్న దృశ్యం



ఈవీఎంల తయారీలో నిమగ్నమైన ఈసీఐఎల్ సిబ్బంది

**'సక్సెస్ స్టోరీ' పేరిట ప్రకటన విడుదల చేసిన యాజమాన్యం**

కుషాయిగూడ, న్యూస్‌లైన్:

దేశవ్యాప్తంగా తొమ్మిది విడతల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికలు విజయవంతం కావడంపై కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఈసీఐఎల్ యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.సుధాకర్ తమ సిబ్బందిని అభినందిస్తూ, తాము సాధించిన విజయాన్ని వివరిస్తూ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈవీఎంల తయారీ, రవాణా, పనితీరు తదితర అంశాలతో కూడిన ఫొటోలను కూడా జతపరచి, అణు ఇంధన శాఖకు చెందిన వివిధ సంస్థలతో పాటు నగరంలోని పలు ప్రభుత్వ సంస్థలకు, మీడియాకు ప్రకటన ప్రతులను పంపించారు.

**1980 నుంచి మొదలైన ఈవీఎం ప్రస్థానం**

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల నిర్వహణను పారదర్శకంగా చేపట్టడంలో ఈసీఐఎల్ సంస్థ పాత్ర ఎనలేనిది. ఈవీఎంల తయారీలో బెంగుళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) కూడా పోటీ పడుతున్నా, సింహభాగం ఈసీఐఎల్‌దే. ఈ రెండు సంస్థలు తయారు చేసిన ఈవీఎంలను మూడో పార్టీ (థర్డ్‌పార్టీ)గా వాటి పనితీరును పరిశీలించి సర్టిఫై చేసే సంస్థ 'ఈటీడీసీ' కూడా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో పనిచేసేదే. భారత ముఖ్య ఎన్నికల అధికారి కోరిక మేరకు 1980లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ సమక్షంలో మొట్టమొదటి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం) పనితీరును వివరించిన నాటి నుంచి నేటి వరకు ప్రతి సార్వత్రిక ఎన్నికల్లో తనవంతు సేవలనందిస్తున్న ఈసీఐఎల్.. ఇప్పటి వరకు దాదాపు నాలుగు లక్షల ఈవీఎంలను రూపొందించింది. మళ్లీ మళ్లీ ఉపయోగించుకునే వీలున్న ఈవీఎంల తయారీతో ప్రతి ఎన్నికల్లోనూ బ్యాలెట్ పేపర్ల తయారీకి అయ్యే ఖర్చును తగ్గించడమే కాకుండా, పేపర్ వినియోగం లేకుండా చేయడంతో పర్యావరణానికి కూడా మేలు చేసినట్లయింది. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో మొదటిసారిగా 'నోటా' పేరిట 'పై అభ్యర్థులు ఎవరూ కాదు' అనే ఆప్షన్‌ను కూడా అమర్చడం జరిగింది. భూటాన్, నేపాల్ వంటి దేశాలకు కూడా ఈవీఎంలను తయారు చేసి ఎగుమతి చేసిన ఈసీఐఎల్, యూరప్‌లోని కొన్ని దేశాలకు ఈవీఎంలను ఎగుమతి చేసేందుకు ప్రయత్నిస్తుండటం కొసమెరుపు.

Sakshi

## ఎన్నికల నిర్వహణలో ఈసీఐఎల్ ఇంజనీర్ల పాత్ర

**ఉద్యోగులను అభినందించిన సంస్థ ఎండీ డా. సుధాకర్**

కుషాయిగూడ, టీ మీడియా: ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల ప్రక్రియలో ఎల్క్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ల పాత్ర ఎంతో ఉందని ఈసీఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. సుధాకర్ అన్నారు. శనివారం ఆయన పత్రిక ప్రకటనను విడుదల చేశారు. 2014 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా దేశవ్యాప్తంగా ఎన్నికల నిర్వహణ, ఫలితాల విడుదలలో ఎలాంటి ఇబ్బందులు తల్తెకుండా సజావుగా ఈవీఎంలు పని చేశాయని, ఇందుకు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో ఈసీఐఎల్ ఇంజనీర్లు కూడా కీలకపాత్ర పోషించారని అభినందనలు తెలియజేశారు. దశాబ్దకాలానికి పైగా



ఈసీఐఎల్ ఎండీ డా. సుధాకర్



ఈవీఎంల తయారీలో నిమగ్నమైన ఈసీఐఎల్ సిబ్బంది

దేశంలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలను ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. ఈవీఎంలను ఆమోదించి ఓటుహక్కును ఉపయోగించుకుంటున్న ప్రజలకు డా. సుధాకర్ అభినందనలు తెలిపారు. తాము తయారు చేస్తున్న ఈవీఎంలను ఇతర దేశాల ఆర్డర్ మేరకు సరఫరా చేస్తున్నామన్నారు.

Namastey Telangana

## ఎన్నికల క్రతువులో

# ఇసిఐఎల్ కీలకపాత్ర



## విదేశాలకు ఈవీఎంల ఎగుమతి








ఇసిఐఎల్ సీఎండి సుధాకర్

**టి.మల్కయ్య, కాప్రా**

ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల దేశాలలో భారతదేశం ద్వితీయ స్థానాన్ని ఆక్రమించింది. అదే విధంగా ప్రజాస్వామ్య దేశంగానూ విఖ్యాతి చెందింది. ఐదేళ్లకోసారి సార్వత్రిక ఎన్నికల క్రతవును సజావుగా, సాఫీగా, స్వేచ్ఛగా నిర్వహించడం కత్తిమీద సాములాంటిది. 120 కోట్ల జనాభాతో అలరారుతున్న భారత్‌లో 81 కోట్ల ఓటర్లు కలిగిన దేశంగా ప్రపంచ దేశాల నుంచి నీరాజనాలు అందుకుంటోంది. రెండున్నర దశాబ్దాల క్రితం మనదేశ ఎన్నికల రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు ఇసిఐఎల్ కేంద్రబిందువు కావడం భారతీయులందరికీ, ముఖ్యంగా తెలుగు ప్రజలకు గర్వకారణం. బ్యాలెట్ పేపర్లు ఉపయోగించడం వల్ల 543 పార్లమెంట్ నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియలో విపరీతమైన జాప్యం జరిగేది. ఫలితాలు చాలా ఆలస్యంగా వెలువడేవి. ఎప్పుడైతే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషిన్‌లను ప్రవేశపెట్టడంతో ఓట్ల లెక్కింపు ప్రారంభమైన 2, 3 గంటల్లోనే పార్టీల భవితవ్యం తేలిపోతోంది. అంతే కాకుండా బ్యాలెట్ పేపర్ల ముద్రణ వ్యయం కోట్లాది రూపాయలు ఆదా కూడా అవుతోంది. ఇంతటి మహత్తరమైన యంత్రాలను అందించిన ఇసిఐఎల్ భారత ప్రజాస్వామ్య చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని కంపెనీ సృష్టించగలగడం మహద్భాగ్యమని ఇసిఐఎల్ సీఎండి పి.సుధాకర్ గర్వంగా చెప్పారు. రక్షణ, విమానయాన, ఐటీ, ఈ-గవర్నన్స్ వంటి కీలక రంగాలకు సైతం ఇసిఐఎల్ విశేషమైన సేవలందిస్తోందని ఆయన వెల్లడించారు. 1989-90 సంవత్సరంలో తొట్ట తొలిసారిగా 75 వేల ఈవీఎంలను కేంద్ర ఎన్నికల సంఘానికి ఇసిఐఎల్, బిఇఎల్ కంపెనీలు సరఫరా చేశాయి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగానికి ఓటర్లలో ఎన్నికల సంఘం చైతన్యం తీసుకురావడానికి ఎంతో కృషి చేసిందని ఆయన తెలిపారు. 2004 సార్వత్రిక ఎన్నికల్లో ఏడున్నర లక్షల ఈవీఎంలను ఇసిఐఎల్ సరఫరా చేయగా.. 2009 నాటికి 13.6 లక్షల ఈవీఎంలను అందజేసింది. దేశవ్యాప్తంగా నాడు 8,28,000 పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలను వినియోగించడం గమనార్హం. తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 'నోటా' ఓటు (తిరస్కరణ ఓటు) అవకాశాన్ని ఈవీఎంలో సంక్షిప్తం చేయడం ఘనకార్యంగా చెప్పుకోవాలి. ఇదిలా ఉండగా భూటాన్, నేపాల్ దేశాల ఎన్నికల సంఘాలకు ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఇసిఐఎల్) 4 వేల పైచిలుకు ఈవీఎంలను సరఫరా చేసి భలా అనిపించుకుంది. అలాగే ఆఫ్రికా, ఆసియాలోని ఇతర దేశాల ఎన్నికల సంఘాలు ఇసిఐఎల్‌ను సందర్శించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషిన్‌లను పరిశీలించి కొనుగోలు చేయడం ఇసిఐఎల్ పనితీరుకు నిదర్శనం. ఓటింగ్ యంత్రాల తయారీలో సాంకేతిక నిపుణులు, సిబ్బంది పాత్ర కంపెనీ ఉన్నతికి దోహదపడిందని సీఎండి సుధాకర్ తెలిపారు. దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఓటింగ్ యంత్రాల పనితీరును కేంద్ర ఎన్నికల సంఘం సంతృప్తి వ్యక్తం చేయడం తమకు, సంస్థకు గర్వకారణమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.




చర్లపల్లి కేంద్ర కారాగారంలో సూపరింటెండెంట్ కె.ఎల్.శ్రీనివాస్‌రావు చేతుల మీదుగా శనివారం జైలు అధికారులకు జైళ్ల శాఖ చిహ్నంతో కూడిన బ్యాడ్జిలను యూనిఫాంపై అలంకరిస్తున్న దృశ్యం. -విశాలాంధ్ర,కాప్రా

## ప్రజాసమస్యలపై పోరాటం చేస్తాం :తలసాని

హైదరాబాద్ (వి.వి) : తమ పార్టీ అభ్యర్థులను గెలిపించిన నగర ప్రజలకు తెలుగుదేశం నగర అధ్యక్షులు తలసాని శ్రీనివాస్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. తమ పార్టీ తెలంగాణలో గెలువదని గ్లోబల్ ప్రచారం చేశారని, అయినా ఉనికిని చాటుకున్నామన్నారు. తెలంగాణలో పార్టీ కోసం పాటుపడిన నాయకులు, కార్యకర్తలకు అండగ ఉంటామన్నారు. ఎవరూ అధైర్య పడోద్దని తలసాని కోరారు. శనివారం ఆయన దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన కెసిఆర్ కు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో కెసిఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను వందరోజుల్లో అమలు చేయాలన్నారు. తెలంగాణ లో ప్రభుత్వంలో ప్రజల సమస్యలపై తెలంగాణ శాసనసభలో ప్రముఖ పాత్ర పోషిస్తామన్నారు. నగరంలో అనేక సమస్యలు ఉన్నాయని, ప్రధానంగా జలమండలిలో అనేక అవకతవకలు జరిగాయని, కృష్ణ, గోదావరి జలాల తరలింపు పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. వాటిపై తాము న్యాయ పోరాటం చేస్తామన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు సమస్యలు పరిష్కరించాల్సి ఉందన్నారు. నగరంలో రోడ్లు, డ్రైనేజి, తాగునీరు తదితర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సనత్‌నగర్‌లో విజయం సాధించిన తలసానిని పార్టీ నాయకులు కార్యకర్తలు అభినందనలు తెలిపారు. నాయకులు ఎం.ఎన్.శ్రీనివాస్‌రావు, వనం రమేష్, పవన్‌కుమార్‌గౌడ్, కార్పొరేటర్లు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శేషుకుమారి, నల్లెల్ల కిషోర్, నాయకులు తొలుపునురి కృష్ణగౌడ్, కరుణకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి విజయఢంకా మోగించి తెలంగాణలో అధిక సీట్లు సాధించిన సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు, ఆయన కుటుంబసభ్యులు, టిడిపి శాసనసభ్యులు తీగల కృష్ణారెడ్డి, కాప్రా సర్కిల్ టిడిపి నాయకులు వంశరాజ్ మల్లేష్, మాజీ కౌన్సిలర్ ఎర్ర రమేష్‌గౌడ్ తదితరులు ఎన్టీఆర్‌కు శ్రద్ధాంజలి ఘటించిన వారిలో ఉన్నారు. -విశాలాంధ్ర,కాప్రా